క్లుప్తంగా

మూలాంకురేశ్వరికి ఖడ్గమాలపూజ



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకు రేశ్వరి అమ్మవారికి భాద్రపద బహుళ సప్తమిని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. లలితా అష్టోత్తర, సహస్రనామాలతో కుంకుమపూజలు చేశారు. ఖడ్గమాల పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పంట నమోదు, ఈకేవైసీకి తొమ్మిది తుది గడువు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతులు ఈ నెల తొమ్మిదో తేదీ లోపు పంట నమోదు, ఈకెవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ మల్లేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తాము పండించే పంట నమోదు ఈకేవైసీ ఈనెల 9వ తేదీలోపు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోవడం వలన అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతింటే నష్టపరిహారం అందుకోవచ్చని, మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని, పంట దిగుబడులు తగ్గినప్పుడు క్రాప్ ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు.

చెత్త తొలగించరూ...

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లో కాలువల్లో తీసిన చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాజాపేట, కొండమెట్లబజార్, రైస్‌మిల్లు రోడ్డు, లక్ష్మీపురం, చర్చిరోడ్డు ప్రాంతాల్లో కాలువల్లో మురుగు, చెత్త, బురదను తొలగించి రోడ్డుపై వేశారు. రోజులు గడుస్తున్నా చెత్త తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను కూడా తీసుకొనివచ్చి ఆ ప్రదేశాల్లో వేస్తుండటంతో దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సైకిల్‌ను శుక్రవారం అందజేశారు. రేవేంద్రపాడులో జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆర్కే పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం 10వ తరగతి యూనిట్ పరీక్షాల ఫలితాల్లో మొదటి యూనిట్, రెండవ యూనిట్‌లో గణిత శాస్త్రంలో నూరుశాతం మార్కులు సాధించిన కిలారి చంద్ర శ్రీహరికి రెండువేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అనంతరం శ్రీహరకు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్నాడన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే స్థానిక నాయకుల ద్వారా విద్యార్థి శ్రీహరకు సైకిల్‌ను బహుమానంగా అందజేశారు.

విధి నిర్వహణలో ఆశావర్కర్ మృతి

ఇల్లు, ఉద్యోగం ఇస్తామన్న అధికారులు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ రేపూడి కృపమ్మ (36) అకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో అక్కడే ఉన్న వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్యశాఖ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్‌బాబు, తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, ప్రభుత్వ వైద్యశాలలకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇళ్ల స్థలం, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగదు ఇస్తామని ఉన్నతాధికారులు తెలియజేసినట్లు ప్రకటించారు. కుటుంబ సభ్యులు ఒక సమయంలో ఒక ప్పుకున్నప్పటికీ వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన కృపమ్మ వేధింపుల కారణంగా చనిపోయిందని, ఆమె కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని ధర్నా చేపట్టారు. దీంతో ప్రకాష్‌నగర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మృతదేహాన్ని తమకు అప్పజెప్పాలని ఆశావర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే ఉద్యమం చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లో పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: ఆనాడు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేసి నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్, దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, డిస్ట్రిక్ ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ సీహెచ్ రత్న మోహన్, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, వైద్యులు మానస, రహమాన్ తదితరులతో కలసి వైద్య శిబిరాలను సందర్శించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య ఉన్నప్పుడే రాష్ట్రం సుసంపన్నంగా ఉంటుందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులు కల్పించారని అన్నారు. ప్రతి ఇంటికీ వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో డాక్టర్లను పంపించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారని తెలిపారు. మెడికల్ క్యాంప్‌లో ఎవరికైనా శస్త్ర చికిత్స చేయాలని నిర్ధారిస్తే వైద్యులు ఆరోగ్యశ్రీ వర్తించే కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి చికిత్స అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రంలో వివిధ రకాల పరీక్షలు చేయించుకుంటున్న వారిని పరామర్శించి వివరాలు అడిగితెలుసుకున్నారు. పీఎంజెవై కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల సర్పంచ్ పలుకూరి మేరమ్మ, ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, మేడా పండు, పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, యువజన నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష

మేడికొండూరు: ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని డోకిపర్రు ఎంపీయూపీ స్కూల్‌లో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం అత్యంత కీలకంగా మారిందని అన్నారు. అందులోభాగంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యం ఖరీదైన అందని ద్రాక్షాగా మారిందని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రజలకు ఉచితంగా అన్ని రకాల వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగననన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. 450 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, గ్రామసర్పంచ్ కొండేపోగు సామ్రాజ్యం, ఉప సర్పంచ్ షేక్ జానీ, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, కె.కోటేశ్వరరావు, ఉడతా ప్రభాకర్, ఉడతా శంకర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీతారావమ్మ, ఆవుల సంజీవరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్‌లు పాములపాటి జయరావు, షేక్ గాలిబ్, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్స్ పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాలకు సుభిక్షమైన సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళుతున్నారని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాడికొండ సత్యసాయి హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న ఖరీదైన వైద్యాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్షా ద్వారా ఇంటి వద్దకే వైద్యులను పంపించి ఉచితంగా సేవలందించడం దేశంలోనే తొలిసారి అన్నారు. తాడికొండ-1 సచివాలయంలో జరిగిన ఈ శిబిరానికి 500 మందికి పైగా రోగులు పాల్గొనడంతో శిబిరం కిటకిటలాడింది. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులు పూర్తిస్థాయి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజినీ, ఎంపీటీసీ ధూళిపాళ్ల నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బి వెంకటేశ్వరరెడ్డి, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, కార్యదర్శి పిట్టు శ్రీనివాసులురెడ్డి, పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని రకాల పరీక్షలు చేశారు



మనం ఉన్న చోట అన్ని రకాల పరీక్షలు చేయడం మొదటిసారిగా చూస్తున్నాను. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిలో షుగర్, మూత్ర, రక్త పరీక్షలు చేశారు. షుగర్‌కు అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేశారు.

–వెంకటేశ్వరరావు, తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్

ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు



15 రోజుల కిందట ఇంటికి వచ్చి డాక్టరమ్మ వైద్య పరీక్షలు నిర్వహించింది. నాకు బీపీ ఉన్నట్లు నిర్ధారించారు. ఆ రోజే మందులు ఇచ్చారు. తిరిగి ఈ రోజు ఆసుపత్రికి రావాలని చెప్పడంతో వలంటీరు దగ్గరుండి తీసుకువచ్చారు. గుండెలో దడగా ఉందని చెప్పడంతో గుండె పరీక్ష చేశారు.

– పేరతోట జయ, ప్రకాష్‌నగర్

ప్రైవేటు ఆసుపత్రిలో ఏ మందులో ఇక్కడా అవే ఇచ్చారు..



నాకు ఏడేళ్ల కిందట పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి విజయవాడలో వైద్యం చేయించుకుంటున్నాను. అక్కడ ఇచ్చిన మందులే వాడుతున్నాను. 15 రోజుల క్రితం డాక్టర్లు ఇంటికి వచ్చి నన్ను పరీక్షించి మందులు ఇచ్చారు. విజయవాడలో ఏ మందులు అయితే ఇచ్చారో వీరు కూడా అవే ఇచ్చారు. ఇక్కడకు వలంటీర్ సహాయంతో వచ్చాను.

–మేకపోతుల వెంకటేశ్వర్లు, తాడేపల్లి యాదవుల బజార్

మహిళలను మహారాణులను చేసిన ఘనత సీఎం జగన్‌దే

రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

మంగళగిరి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా మహిళల ఖాతాలలో జమచేసి మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు లీడర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొలుత నగర పరిధిలోని ఆత్మకూరు, చినకాకాని, కాజలలో పర్యటించి పాఠశాలలు, సచివాలయాలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాలు గురించి మహిళలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విలియమ్స్, ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చినపాలెం గ్రామానికి చెందిన బుల్ల మరియదాసు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆ వ్యక్తి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం చేతుల మీదుగా శుక్రవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చికల తిమోతి, బుల్లా శ్రీను, బుల్లా జక్రయ్య, యల్లమాటి ప్రసాద్, బుల్లా రామయ్య, వల్లెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యానికి అద్భుత రూపం

తాడేపల్లిరూరల్: నులకపేటకు చెందిన చిత్రకారుడు గన్నెపూడి కల్యాణ్‌కుమార్ వేమన విద్యాకేంద్రం, తిరుపతి శ్రీ కళాక్షేత్రం వారు సంయుక్తంగా నిర్వహించిన ఫైన్ ఆర్ట్స్ విభాగంలో వేమన పద్య భావనా చిత్ర కళా పోటీల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. వేమన పద్యాలలో ఒకటైన నీళ్లలోన మీను నిగిడి దూరం పారుకి అర్థం వచ్చేటట్లు గన్నెపూడి కల్యాణ్ ఫైన్ ఆర్ట్ వేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అక్టోబర్ 29వ తిరుపతిలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కల్యాణ్ బహుమతి అందుకోనున్నారు. నులకపేట వాసులు కల్యాణ్‌కు అభినందనలు తెలియజేశారు.

ఉన్నత విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు

విద్యార్థులకు నగదు బహూకరణ



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: ఉన్నత విద్య ద్వారానే సమాజంలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో యూనిట్ పరీక్షా ఫలితాల్లో గణిత శాస్త్రంలో నూరుశాతం మార్కులతో ప్రతిభ కనబరిన విద్యార్థులకు శుక్రవారం నగదు బహూకరణ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పుస్తకాలు చదడం, వ్యాసాలు రాయడం, ప్రాజెక్ట్ వర్కులు చేయడం లాంటివి నేర్చుకోవాలని ఉన్నత విద్య చదివితే వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మారడంతోపాటు ఎంతో ఉన్నత స్థాయికి వెళతారని అన్నారు. గణితశాస్త్రంలో నూటికి నూరుశాతం మార్కులు సాధించిన పడాల నాగప్రియాంక, కిలారి చంద్ర శ్రీహర, ఆకుల సాయి సంజనలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, సర్పంచ్ పలుకూరి మేరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో వీఐటీ-ఏపీ విద్యార్థికి బంగారు పతకాలు



వినయ్‌ను అభినందిస్తున్న వీఐటీ ఏపీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీడీ తదితరులు

ఐనవోలు(తాడికొండ): ద్వితీయ సౌత్ ఇండియన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో తమ విశ్వవిద్యాలయానికి చెందిన బీ-టెక్ 3వ సంవత్సరం విద్యార్థి కె వినయ్ రెండు బంగారు పతకాలు సాధించారని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీన రాజమండ్రిలో జరిగిన 2వ సౌత్ ఇండియన్ చాంపియన్‌షిప్‌లో కరాటేలోని కాటా, కుమిటే విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి కె వినయ్‌కు రెండు బంగారు పతకాలు వరించడం అభినందనీయమన్నారు. కరాటేలో గోల్డ్ మెడల్ అంటే చిన్న విషయం కాదని, ప్రతిభ కలిగిన విద్యార్థులను విశ్వ విద్యాలయం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందనేందుకు ఈ విజయాలే నిదర్శనమన్నారు. విద్యార్థి వినయ్‌ను వీసీతోపాటు రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రరావు పలువురు అభినందించారు.

చిత్ర కళ పోటీలలో వడ్డేశ్వరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు తదితరులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రకళా పోటీలలో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం జి.సుబ్బారావు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళ అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ పోటీలలో రామాయణం అనే అంశంపై పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. 10వ తరగతి విద్యార్థిని ఎస్.శిరీష కాంస్య పతకం సాధించిందని, 12 మంది విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారని వివరించారు. విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ, జోజప్ప, బుజ్జిబాబు, సుందరరాజు, పద్మావతి, జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, విద్యుత్ లేన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయాన్ని ఉంటుందని తెలిపారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లెంపూడి గ్రామాల్లోను, మెల్లెంపూడి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌లకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేఎల్‌యూ రోడ్డులోని లేన్ల మార్పిడి నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

భక్తులకు అన్ని వసతులు కల్పించడమే లక్ష్యం

- పాఠశాలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు
- సికె బాలికల ఉన్నత పాఠశాలలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే. ఎమ్మెల్సీ మురుగుడు



సికె ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకల వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వెనుక ఉన్న చింతక్రింది కనకయ్య బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆలయానికి చెందిన ఎకరం స్థలంలో బాలికల ఉన్నత పాఠశాల నడుస్తుండగా అర ఎకరం స్థలం ఖాళీగా ఉందని, ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఆ స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేవస్థాన అధికారులు, పాఠశాల యాజమాన్యంతో చర్చించి ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పార్కింగ్ వలన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాలకు కేటాయించిన స్థలం వరకు ప్రహరీ నిర్మాణం చేపడతామని తెలిపారు. పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండ, గండాలయ స్వామి కొండలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

నేతన్న సర్కిల్ చారిత్రాత్మక కట్టడంగా రూపుదిద్దాలి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ముఖద్వారంలో నేతన్న సర్కిల్ పేరుతో నిర్మిస్తున్న నేతన్న విగ్రహంతోపాటు పాతబస్టాండ్ ఆవరణలో తుదిదశకు చేరుకున్న చేనేత భవన్‌లు చారిత్రాత్మక కట్టడాలుగా రూపుదిద్దాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)అధికారులకు సూచించారు. నగరంలో నేతన్న సర్కిల్(ఎన్ఆర్ఐ జంక్షన్)లో జరుగుతున్న నేతన్న సర్కిల్, విగ్రహ ఏర్పాటు పనులతోపాటు పాతబస్టాండ్ సెంటర్‌లోని చేనేత భవన్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నేతన్న గుర్తుకువచ్చేలా నేతన్న విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అంతేకాక నేతన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్న ఎన్ఆర్ఐ జంక్షన్‌ను నేతన్న సర్కిల్‌గా నామకరణం చేసి నేతన్న ఖ్యాతిని ఇనుమడింపచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నేతన్న విగ్రహం చుట్టూ నేత ఎలా నేస్తారో అని తెలియజేసే విధంగా బొమ్మలతో కూడిన రాతలతో వివరిస్తామన్నారు. స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్‌లతో పలు పనులను సత్వరమే పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్, నాయకులు దేవళ్ల సుబ్బారావు, రజక సంఘం వెంకటేశ్వర్లు, మహిళా నాయకులు మల్లవరపు సుధారాణి, గుంటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



నూతక్కి విద్యార్థులు

మంగళగిరి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి, నిడమర్రు జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కట్టిపోగు మహేంద్ర ఇటీవల వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 వాలీ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నూతక్కి రవి తెలిపారు. నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేజెండ్లలో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరచిన బాలికలు ఎస్‌కె బషీరున్నీసా, దాసరి కీర్తిలు రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా నూతక్కి సంతోష్‌కుమార్ బాలుర జట్టుకు ఎంపికయ్యాడు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



రేవేంద్రపాడు పాఠశాల విద్యార్థి జి.సంతోష్

తాడేపల్లిరూరల్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలకు దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.సంతోష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ చేబ్రోలు మండలం వేజెండ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు ఎంపికల్లో రేవేంద్రపాడు విద్యార్థి జి.సంతోష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, ఈ నెల ఏడో తేదీ నుండి కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. సంతోష్‌ను విద్యాకమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాష్‌రావు, పీడీ మల్లంపూడి రవి, గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ అభినందించారు.

అభివృద్ధి పనుల్లో అవినీతికి తావులేదు

ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో అవినీతి అనేది జరిగే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో మట్టి తవ్వకాల్లో అవినీతి జరుగుతోందని కొంతమంది విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించడంతో స్పందించిన ఎమ్మెల్యే అభివృద్ధి పనుల్లో అవినీతి జరగదు, జరగబోదు, స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 40-50 సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోని రోడ్లను, డొంక రోడ్లను శరవేగంగా అభివృద్ధి చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అన్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి మంగళగిరి నియోజకవర్గంలో జరిగిందని పేర్కొన్నారు. విమర్శించే నాయకులు తమ మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని అన్నారు. ఎవరో ఏదో విమర్శించారని నియోజకవర్గంలో అభివృద్ధిని ఆపబోమని అన్నారు. వైఎస్సార్‌సీపీ అజెండా సంక్షేమం, అభివృద్ధేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి రూ.130 కోట్ల నిధులు కేటాయించారని, ఆ నిధులతో మండలాలను, ప్రాంతాలను కలుపుతూ రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని అన్నారు. రాజకీయం చేసి కొంతమంది లబ్ధి పొందాలని ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఎక్కడైనా పేదవారి ఇళ్లను తొలగించాల్సి వస్తే వారికి తప్పని సరిగా ఇళ్ల స్థలాన్ని కేటాయించి ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగదు కేటాయిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాజకు చెందిన అంబటి కల్యాణ్ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో స్టోర్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కల్యాణ్ రోజూ లాగానే శుక్రవారం తన దిచక్రవాహనంపై విధులకు వచ్చి స్టాఫ్ పార్కింగ్‌లో వాహనాన్ని పార్క్‌చేసి విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా వాహనం కనపడకపోవడంతో చోరీకి గురైందని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.